ప్రజాశక్తి
సోమవారం 22 మే 2023
5
పార్వతీపురం మన్యం



అప్రకటిత విద్యుత్తు కోతలతో అవస్థలు



అంధకారంలో ఉన్న బాగువలస గ్రామం

సాలూరురూరల్: అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు నానా అవస్థలు పడుతు న్నారు. గత కొంతకాలంగా ప్రతి రోజూ సుమారు 5 నుంచి 6 గంటలు ఇఎల్ఆర్ పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపున ప్రభుత్వం విద్యుత్ కోతల్లేవని చెపుతుంటే మరోవైపు అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అసలే విపరీతమైన ఎండలతో బాధపడుతుంటే ఈ అప్రకటిత కోతలతో మరింత ఎక్కువయ్యాయని బాధపడుతున్నారన్నారు. తమ బాధలను గుర్తించి సక్రమంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగేళ్లలో రెండే సమావేశాలు

- పాలక వర్గానికి తీరిక లేదా?
- గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై చిత్తశుద్ధిలేని పాలకులు, అధికారులు
- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు

వెనుకబడిన గిరిజన ప్రాంతాలను అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసింది. అధికారులు, ప్రజాప్రతినిధులతో కూడిన పాలకవర్గం ప్రతి మూడునెలలకొకసారి సమావేశమై గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న సమస్యల పరిష్కారంపై చర్చించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆ దిశలా ఎలాంటి సమావేశాలు జరగడంలేదు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన ఈ నాలుగేళ్లలో కేవలం రెండే సమావేశాలు జరిగాయి. సాక్ష్యాత్తూ గిరిజన సంక్షేమశాఖా మంత్రి సొంత జిల్లాలోనే సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోతే ఇక మిగిలిన ఐటిడిఎల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాలకవర్గం సమావేశమై అభివృద్ధి పనులపై చర్చ జరిపి గిరిజనాభివృద్ధికి పాలకులు అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు నిబంధనల ప్రకారం ప్రతి మూడు నెలలకు జరగాల్సి ఉంది. నిర్ణీత కాలంలో సమావేశాలు జరగకపోవడంతో గిరిజన గ్రామాల్లో సమస్యలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. వైసిపి ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు గడుస్తున్నా రెండు పాలకవర్గ సమావేశాలు నిర్వహించకపోవడం ప్రభుత్వ ఉదాసీనతనకు నిదర్శనం. దీన్ని బట్టి గిరిజనుల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఏ విధంగా శ్రద్ధ ఉందో కనిపిస్తుంది. ఐటిడిఎ పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్, గిరిజన విద్య, ఉపాధి హామీ చట్టం, ఉద్యానశాఖ, మైనర్ ఇరిగేషన్, వైయస్సార్ క్రాంతి పథం తదితర 22 శాఖలు అనుబంధంగా ఉన్నాయి.



సీతంపేట ఐటిడిఎ కార్యాలయం

వైసిపి ప్రభుత్వ హయాంలో రెండు పాలకవర్గాలు మాత్రమే నిర్వహించారు. అధికార పార్టీ గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర పార్టీ కార్యక్రమాలకు నిర్వహిస్తున్నారు తప్ప దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష నేతలు కూడా ఇదేం కర్మ వంటి పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారు తప్ప గిరిజన సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా సమావేశాలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఏజెన్సీలో ఇప్పటికే ప్రధానంగా తాగునీటి సమస్య వెంటాడుతుంది. రహదారుల సమస్యతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ ధర లేక దళారుల బారిన పడి నష్టాలు చవిచూస్తున్నారు. ఇటీవల కాలంలో భామిని మండలంలో కాట్రగడ-బి, పకుడ భద్రలో విద్యుత్ షాక్‌తో నాలుగు ఏనుగులు మృతి చెందాయి. ఏనుగుల ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినా, దీనికి సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు, నాలుగో తరగతి సిబ్బంది, కుక్, కమాటీ, వాచ్‌మెన్ తదితర సుమారు వంద పోస్టుల వరకు ఖాళీలు ఉన్నాయి. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత చెందిన వారు సుమారు 2వేల మంది ఉంటే దానికి సంబంధించిన నాలుగు గురుకుల కళాశాలలో వెయ్యి సీట్లు వరకే అవకాశం ఉంది. ఐటిడిఎలో పిహెచ్ఒ, ఎఒ, మేనేజర్, నాలుగు ఎపిడి, ఎస్ఒ వంటి కీలక పోస్టులు ఇన్‌ఛార్జులతోనే నడుస్తుంది. గిరిజన గ్రామాల్లో జగనన్న గృహాలు పునాదులకే పరిమితమయ్యాయి. గిరిజన గ్రామాల్లో సెల్ టవర్ లేక సచివాలయం సేవలు బయోమెట్రిక్ పెన్షన్ పంపిణీ కమ్యూనికేషన్ ఆటంకం కలుగుతుంది. అలాగే ఆడాలి వ్యూ పాయింట్, గిరిజన మ్యూజియం, జగత్ పల్లి రిసార్ట్స్ తదితర పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు గిరిజనాభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో సక్రమంగా సమావేశాలు నిర్వహించాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

నాడు-నేడు పనులు తనిఖీ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పెదబుడ్డిడి పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు నేడు పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. పెదబుడ్డిడి పాఠశాలలో రూ.65.15 లక్షలతో పనులు మంజూరు చేయగా, వాటిలో రెండు అదనపు తరగతి గదులకు రూ.23.34 లక్షలు, నాడు నేడులో పది అంశాలను సమకూర్చేందుకు రూ.41.81 లక్షలు ఉన్నాయి. పనుల నాణ్యతలో రాజీపడరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నాడు-నేడులో చేపట్టాల్సిన పది అంశాలను పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అదనపు తరగతి గదుల పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అందించాలని ఆయన అన్నారు. పనులు చక్కగా ఉండాలని, పాఠశాల ఆహ్లాదకర వాతావరణంలోకి మారాలని తద్వారా విద్యార్థులు ఆకర్షితులు కావాలని ఆయన పేర్కొన్నారు. పనులు వేగవంతంగా పూర్తి కావడానికి జిల్లా విద్యాశాఖ అధికారి, ఏపిఎం, ప్రధాన ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి నాడు-నేడు పనులు చేపట్టిందని, వాటిపై దృష్టి సారించాలని ఆయన అన్నారు.

సకాలంలో పుస్తకాలు పంపిణీ చేయాలి

అన్ని పాఠశాలలకు సకాలంలో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, జగనన్న కానుక కిట్లు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జియ్యమ్మవలస పాఠశాలలో ఇప్పటికే చేరిన పుస్తకాలు, జగనన్న కానుక కిట్లను కలెక్టర్ పరిశీలించారు. ముందస్తు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పాఠశాలలు పునః ప్రారంభమైన వెంటనే పంపిణీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



కురుపాంలో విద్యార్థుల యూనిఫాంను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

నాడు-నేడు, జెవికె కిట్లు పరిశీలన

కురుపాం : స్థానిక కెజిబివి పాఠశాల, మోడల్ స్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి నిమ్మల ప్రేమ్ కుమార్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కెజిబివిలో జరిగిన నాడు -నేడు ద్వారా నిర్మితమైన తరగతి గదుల నిర్మాణ పనులను క్షుణంగా పరిశీలించారు. అనంతరం మోడల్ స్కూల్‌లో గల జెవికె కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను పాఠశాలలు తెరిచేసరికి పూర్తి చేయాలని, అలాగే విద్యా సంవత్సరానికి అవసరమైన కిట్లను సిద్ధం చేసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం టి.శంకర్రావు, సిఆర్‌పిలు నరేష్, రజియా పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాలను భద్రంగా ఉంచాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలను ఆదివారం ఆయన పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి మరో 20 రోజుల సమయం ఉన్నందున పాఠ్యపుస్తకాలకు చెదలు, వర్షపు నీటికి తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బిడ్డిక భీముడు ఉన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

సీతానగరం : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆదివారం విద్యార్థులకు గ్రంథాలయాధికారి బి.వెంకటరావు ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానంతో పాటు ఆటలు కూడా ఉండాలన్నారు. ఈ శిక్షణా శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగుతాయన్నారు

హోరాహోరీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 66వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం నిర్వహించిన కబడ్డీ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో కృష్ణ జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో విజయనగరం జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్‌పి మాట్లాడుతూ వచ్చే నెల ఆరో తేదీ నుంచి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రాన్ని విజేతగా నిలపాలన్నారు. కార్యక్రమంలో డివిఇఒ సురేష్‌బాబు, టోర్నమెంట్ పరిశీలకులు జయరాజ్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మన్యం జిల్లా చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

స్థానిక కస్పా హైస్కూల్ మైదానంలో అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ ప్రారంబించారు. ముందుగా భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయనగరం, చిత్తూరు జట్లు, ప్రకాశం, తూర్పుగోదావరి జట్ల మధ్య పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులు పట్టాభిరాం పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో ఆదివారం కౌన్సిలర్ వారణాసి కల్యాణి, మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం ఉపాధ్యక్షులు గెంబలి బాలమురళీకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఎన్నారై ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం ప్రారంభించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో వందలాది మంది ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఎమ్మెల్యే కూడా వైద్య పరీక్షలు చేయించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురం ప్రాంతంలో ఇటువంటి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన బాలమురళీకృష్ణ, కౌన్సిలర్ కళ్యాణికి అభినందనలు తెలిపారు. అలాగే ఇంతటి మెగా వైద్య శిబిరానికి ముందుకొచ్చి సహకరించిన ఎన్ఆర్ఐ ఆసుపత్రి సిబ్బందికి కూడా తన అభినందనలు తెలిపారు. ఎంతోమంది పేదలకు ఈ వైద్య శిబిరం ద్వారా ఉచిత పరీక్షలతో పాటు మందులను సైతం పొందగలుగుతారని తెలిపారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రి ప్రతినిధి అయిన మిత్రుడు గతంలో కరోనా సమయములో పార్వతీపురం ప్రాంత వాసులకు ఎంతో సహాయ సహకారాలు అందించారని,ఎటువంటి ఎమర్జెన్సీ పరిస్థితి వచ్చిన తాను అండగా ఉన్నామని భరోసానిచ్చే ఎంతో మందిని తన ఎన్నారై ఆస్పత్రి ద్వారా ఆదుకోవడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం పెద్దలు, సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఎన్ఆర్ఐ ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఎస్ఎఐ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

హానికరమైన రంగు పదార్థాలు కలిపిన ఆహార పదార్థాలను తీసుకోకూడదు

'ప్రజాశక్తి'తో ఆహారభద్రత జిల్లా అధికారి వై.రామయ్య ముఖాముఖి





ప్రతి హోటల్, రెస్టారెంట్ల యజమానులు ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ధ్రువీకరపత్రాలు తప్పనిసరిగా పొందాలని ఆహారభద్రత జిల్లా అధికారి వై.రామయ్య తెలిపారు. రెస్టారెంట్లలోనూ, వివిధ హోటళ్లు, బండ్లపై విక్రయించే ఆహార పదార్థాలపై హానికరమైన రంగులు వేస్తున్నారని, వీటిని ఎవరూ తినకూడదని సూచించారు. అలాగే హానికరమైన రంగులను వినియోగించే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వస్తువు ప్యాకింగ్‌పై ఆ వస్తువు గడవు, బ్యాచ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలని, అది గమనించే వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు. వీటితో పాటు మరిన్ని వివరాలను 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే....

-ప్రజాశక్తి, కలెక్టరేట్

జిల్లాలో ఫుడ్ సేఫ్టీ పై తనిఖీలు ఏవిధంగా జరుగుతున్నాయి?

జిల్లాలో ఆహారభద్రతాశాఖ ఆధ్వర్యంలో తరచుగా తనిఖీలు జరుగుతాయి. ఎవరైనా వ్యక్తులు ఏవైనా ప్రాంతంలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించి, రాత పూర్వకంగా దరఖాస్తు ఇస్తే ఆయా వ్యాపార సంస్థలు, హోటళ్లను తనిఖీ చేసి నమూనాలను సేకరిస్తున్నాం.

ఆహార పదార్థాల కల్తీపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆహార పదార్థాల కల్తీ జరిగినట్లుగా అనుమానం వస్తే వెంటనే నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నాం. ప్రయోగశాల నుంచి వచ్చిన రిపోర్టుల ఆధారంగా కల్తీ జరిగినట్లుగా కానీ, మిస్ బ్రాండ్‌గా గాని నిర్ధారణ జరిగితే ఆ కేసులను జాయింట్ కలెక్టర్ వద్దకు పంపిస్తాం. ఒకవేళ ప్రయోగశాల నివేదికలో అన్ సేఫ్ (సురక్షితం కాదు) గా రుజువైతే ఆ కేసును కోర్టుకు పంపిస్తాం. కోర్టులో సురక్షితం కాదని రుజువైతే కొంత సొమ్ము జరిమానా కానీ జైలు శిక్షకానీ, కొన్ని సందర్భాల్లో సొమ్ము జరిమానా, జైలు శిక్ష రెండూ కూడా విధిస్తారు.

నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై చర్యలు ఏ విధమైన తీసుకుంటున్నారు?

హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహించే వారికి తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్సును కలిగి ఉండాలి. ఎవరైనా ఈ లైసెన్స్ లేకుండా హోటల్ కానీ రెస్టారెంట్లు కానీ ఏర్పాటు చేస్తే ఆ యజమానికి నోటీసులు అందజేసి, వెంటనే లైసెన్స్ తీసుకొనేలా చర్యలు తీసుకుంటాం. ఆరోగ్యానికి హాని కలిగించే రంగులను ఆహారంలో కలపకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఇంత వరకు జిల్లాలో ఎన్ని నమూనాలు సేకరించారు?

ఇంతవరకు జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో 50నమూనాలను సేకరించాం. కల్తీ నిర్ధారణకు ప్రయోగశాలకు పంపిస్తున్నాం. సేకరించిన నమూనాలు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి.

ఫుడ్ సేఫ్టీపై ప్రజలకు ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఫుడ్ సేఫ్టీపై అవగాహన కోసం హాస్టళ్లు, స్కూళ్లు, కాలేజీల్లో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దీని ద్వారా కల్తీ జరిగిన, కాలం చెల్లిన, పాడైపోయిన ఆహార పదార్థాలను గుర్తించి, ఆయా పదార్థాలను వినియోగించడం ద్వారా జరిగే నష్టాలను వివరిస్తున్నాం. వీటి పట్ల విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందిస్తున్నాం.

ప్యాకింగ్ పదార్థాలపై ఎటువంటి అవగాహన ఉండాలి?

ప్యాకింగ్ ఆహార పదార్థాలపై ప్యాకింగ్ డేట్, ఎక్స్‌డేట్, బ్యాచ్ నెంబర్లు తప్పనిసరిగా ఉండాలి. ఇవేవీ లేని పక్షంలో ఆహార పదార్థాలను వాడరాదని, అటువంటి ఆహార పదార్థాలు అమ్మకూడదని వ్యాపారులకు తెలియజేస్తున్నాం. ఒకవేళ ఎవరైనా అమ్మినట్లయితే ఫుడ్ సేఫ్టీ అధికారులను సంప్రదించాల్సిందిగా ప్రజలకు తెలియజేస్తున్నాం.



పద్యపరిమళాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పద్య పరిమళాలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ఉపాధ్యాయుడు, విజయనగరం జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు జాగాన సింహాచలం రచించిన పద్య పరిమళాలు, సమస్య పురాణాలు పుస్తకాలను ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన సమావేశంలో ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు ఆవిష్కరించారు. రచయిత చింతా అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మళ్లీపురం జగదీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ చిత్రకారుడు, సినీ కవి తుంబలి శివాజీ పుస్తకాలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా గౌరు నాయుడు మాట్లాడుతూ సాహిత్య పఠనాసక్తి వయోధికులు ఆసక్తి చూపినంతగా వయోజనులైన వారు పుస్తకాలు చదవడంలో ఆసక్తి చూపించడం లేదని, యువత సాహిత్యాభిలాషం పెంచేలా సాహిత్య సంస్థలు, కవులు, రచయితలు కృషి చేయాల్సి అవసరం ఉందని అన్నారు. అనంతరం పెద బొండపల్లి గ్రామానికి చెందిన యాండ్రాపు చినరామినాయుడు ఆలపించిన పద్యాలు, సభికులను, ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రచయితలు, కవులు పాలకొల్లు రామలింగస్వామి, సిరికి స్వామి నాయుడు, పక్కి రవీంద్రనాథ్, చిత్రకారుడు చందనపల్లి గోపాలరావు (గోరా), గడగమ్మ రామకష్ణ శాంతి, నాగు కాకిముక్కల, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

కవితల పోటీల్లో రోహిణికుమార్‌కు పురస్కారం



ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

డాక్టర్ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీల్లో పార్వతీపురానికి చెందిన పల్ల రోహిణికుమార్‌కు రెండో బహుమతి లభించింది. ఈ మేరకు ఆదివారం నిర్వాహకుల నుంచి సమాచారం రచయితకు అందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయిన సందర్భంగా అమృతోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దేశభక్తి - పురోగతి - జాతీయత ప్రధానాంశాలుగా పాలపిట్ట- వాసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవితల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా ప్రముఖ విమర్శకులు ఎం.నారాయణశర్మ వ్యవహరించారు. కవితల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జూన్ 6న హైదరాబాద్‌లో జరుగుతుందని నిర్వహకులు చెప్పారు. ఎన్.రమాదేవి రచించిన శోకంలేని లోకం కవితకు మొదటి బహుమతి రాగా, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పల్ల రోహిణి కుమార్ రాసిన రేపటి సూర్యోదయం కోసం కవితకు రెండో బహుమతి లభించింది. మూడో బహుమతి అమృతోత్సవాల ప్రగతి స్ఫూర్తికి (రాజా మానాపురం చంద్రశేఖర్) లభించింది. ఎనిమిది కవితలకు ప్రత్యేక బహుమతులు ప్రకటించారు. అభినవ భారతి - కరిపె రాజ్ కుమార్, సత్యమేవ జయతే - స్వప్న మేకల, వెలుగులు నింపుదాం - అల్లాడి శ్రీనివాస్, వజ్రోత్సవ కానుక దాసరి మోహన్, నా గుండె కాల్చుకుతినే గుడ్డె - వేల్పుల రాజు, పొడిచే పొద్దు - బొప్పెన వెంకటేష్, స్వేచ్ఛలేని ప్రాణం మట్టిపటం - శ్రీకాంత్ బింగి, మట్టి తిలకం బి. గోపాల్‌లు రాశారు. పల్ల రోహిణి కుమార్‌ను మన్యం జిల్లాకు చెందిన రచయితలు,కవులు, సాహితీ వేత్తలు, అరసం సాహితీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే జోగారావుపై టిడిపి ఫిర్యాదు


ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలను వక్రీకరిస్తూ ఆయన దిష్టిబొమ్మను స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు దగ్ధం చేయడం, వాటిని ప్రేరేపించడంపై మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో ఆదివారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న ఎమ్మెల్యేతో పాటు వైసిపి నాయకులు కొండపల్లి బాలకష్ణ, జి.మాధవరావు, బొంగు చిట్టిరాజు, బోను గౌరీశ్వరి, భీమవరపు కృష్ణమూర్తి, వెంపల గుర్రాజు, బొమ్మి రమేష్, సిద్ధజగన్నాథం, యడ్ల త్రినాథ, బంకురు రవికుమార్‌తో పాటు సుమారు 50 మంది వైసిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేయడం చట్ట వ్యతిరేకమైన చర్యని అన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన ఎమ్మెల్యే బాధ్యతను విస్మరించి, ఉల్లంఘించడం అత్యంత దారుణమన్నారు. ఈ సంఘటనపై ఇంతవరకు పోలీసులు గానీ, నిఘా విభాగం (ఇంటిలిజెన్స్)గానీ ఎటువంటిచర్య తీసుకోకపోవడం చూస్తుంటే అధికారపార్టీకి, ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నట్టేనని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ వేతన దారులను ఉపయోగించుకోవడం అత్యంత దారుణమన్నారు. వీరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే సిఎం దిష్టి బొమ్మను దగ్ధం చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, ఉదయభాను, దొగ్గ మోహన్‌రావు, జి.రవికుమార్, బోను చంద్రమౌళి, కౌన్సిలర్లు టి.వెంకట్రావు, బి.గౌరినాయుడు, కోల మధుసూదన్‌రావు, సరిత, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

కురుపాం : నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో శనివారం చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం కురుపాం పోలీస్ స్టేషన్‌లో టిడిపి శ్రేణులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక దిష్టిబొమ్మలు దహనం లాంటివి చేస్తున్నారని ఇటువంటి కార్యక్రమాలు చేయడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ, టిడిపి ఆశావాహులు బిడ్డిక పద్మావతి, పువ్వల లావణ్య, మాజీ ఎంపీపీ జివి రమణమూర్తి, టిడిపి నాయకులు చందక రామకృష్ణ, బండి రాజు, సునీత, కొండలరావు, సీతారాం, రామారావు, మిన్నరావు, విజయ్, నిక్కల శ్రీహరి పాల్గొన్నారు.



బాధితుడికి సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

బుగ్గన్నకు ఆర్థిక సాయం

సీతంపేట : మండలంలోని వజ్జాయిగూడ పంచాయతీలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో నోటి కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న సవర బుగ్గన్న అనే వ్యక్తి ఎమ్మెల్యే వి.కళావతి దృష్టికి తన బాధను తెలియపర్చగా, ఆమె స్పందించారు. ఈ విసయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రూ.2లక్షలు చెక్కును ముఖ్యమంత్రి సహాయం నిధి నుంచి వచ్చిన చెక్కును ఎమ్మెల్యే బుగ్గన్నకు ఆదివారం అందజేశారు.



గ్రామస్తులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బూర్జలో గడపగడపకు మన ప్రభుత్వం

సీతానగరం : మండలంలోని బూర్జలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం ఆకర్యక్రమ నిర్వహించారు. గ్రామంలో గల నాయుడు వీధి నుంచి ఎమ్మెల్యే గడప గడపకు కార్యక్రమం ప్రారంభించి ప్రజలను కలుసుకుని వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. ఏ సమస్యా ఉన్నా తక్షణ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, సర్పంచ్ జి.దాసు, జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, సర్పంచులు జి.అన్నం నాయుడు, కె.శ్రీనివాసరావు, బలగ శ్రీనివాసరావు, టి.వెంకటరమణ, పి.శ్రీనివాసరావు, వైసిపి సీనియర్ నాయకులు ఆర్వీ, పోల ఈశ్వర నారాయణ, బి.ముకుంద, బి.గౌరి నాయుడు, రెడ్డి అప్పలనాయుడు, పి.సత్యనారాయణ, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అరసం జిల్లా కమిటీ ఎన్నిక

పార్వతీపురం రూరల్ : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మన్యం జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా చింతా అప్పలనాయుడు, ఉపాధ్యక్షునిగా పల్ల రోహిణి కుమార్, ప్రధాన కార్యదర్శిగా పాలకొల్లు రామలింగస్వామి, కోశాధికారిగా పిల్లా లక్ష్మణరావును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అధికారి రవికుమార్, ఆగూరు రామారావు, గొట్టాపు తిరుపతిరావు, మంత్రావు రామారావు, పల్ల మోహనరావు, ఊల్ల రాము, సారిపల్లి నాగరాజు, తోటపల్లి శేఖర్ ఎన్నికయ్యారు. జిల్లాలో అరసం ద్వారా మంచి సాహిత్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు అన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జివిఎస్ చలం, రత్నాల బాలకృష్ణ, పలువురు రచయితలు పాల్గొన్నారు.



శ్రమదానంతో తుప్పలను తొలగిస్తున్న యువకులు

శ్మశాన వాటికలో శ్రమదానం

సాలూరు: పట్టణంలోని గాంధీనగర్ వీధికి సంబంధించిన శ్మశాన వాటికను అభివృద్ధి చేయడానికి పారిశుధ్య కార్మికులు శ్రమదానం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.శంకరరావు ఆధ్వర్యాన గాంధీనగర్ యువకులు శ్మశాన వాటికలో తుప్పలు, డొంకలను తొలగించారు. ఎవరైనా మరణించిన సమయంలో మృతదేహాన్ని దహనం చేసేందుకు అనువైన పరిస్థితులు అక్కడ లేకపోవడంతో గాంధీనగర్ వాసులే శ్రమదానం చేసి చదును చేశారు. శ్మశానం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని యూనియన్ నాయకులు శంకరరావు కోరారు.




రాజేష్ తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీరామంజనేయదేవి సొసైటీ సభ్యులు

రాజేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

వీరఘట్టం : మండలంలోని ఎం.రాజపురానికి చెందిన డి.రాజేష్ పోలీస్ పరుగు పందెంలో మృతి చెందిన విషయం తెలిసినదే. ఆదివారం మండలం కత్తులకవిటికి చెందిన శ్రీ రామాంజనేయ దేవి సొసైటీ వారు రూ.25 వేలు రాజేష్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సొసైటీ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాజేష్ కు సొసైటీ సభ్యులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

సాలూరు : పార్వతీపురం మండలం తాళ్లబురిడిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన గేదెల గుంపస్వామికి ఎరుకలి సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పాలవలస మధుసూదనరావు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం తాళ్లబురిడి వెళ్లి బాధితుడైన గుంపస్వామికి రూ.6,600 సాయం అందించారు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న విషయానికి స్పందించినట్టు వారు తెలిపారు.



బాధితునికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎరుకుల సేవా సంఘం నాయకులు

23 ఏళ్ల అనుభవంతో ....

ఉన్నత విద్యాబోధనే ఆర్‌కె ధ్యేయం

విద్యాసంస్థల డైరెక్టర్ పూడి రామకృష్ణ

ప్రజాశక్తి- పార్వతీపురం

23 ఏళ్ల అనుభవంతో ఉన్నత విద్యలైన జెఇఇ, నీట్ వంటి విద్యా బోధనలు అందిస్తున్నామని ఆర్కే జూనియర్, ఐఐటి అండ్ నీట్ అకాడమీ కళాశాల డైరెక్టర్ పూడి రామకృష్ణ తెలిపారు. 2022 -23 విద్యా సంవత్సరంలో ఇంటర్, జెఇఇ ఫలితాలు సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...

విజయనగరం, విశాఖపట్నం నారాయణ, శ్రీ చైతన్య ఐఐటి, నీట్ అకాడమీలో పలు ప్రైవేటీ కళాశాలలో 18ఏళ్లు అధ్యాపకునిగా, ఐదేళ్లు ప్రిన్సిపల్‌గా రాష్ట్ర, జాతీయ స్థాయి ర్యాంకులను సాధించిన అనుభవంతో ఆ తరహాలోనే పార్వతీపురం కేంద్రంలో ఆర్‌కెను స్థాపించి కార్పొరేట్‌కు ధీటుగా బోధనలు అందిస్తున్నాం. 2000లో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలు ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకునిగా 2008 వరకు చేసి, విశాఖపట్నం, నారాయణ, శ్రీచైతన్యలో అధ్యాపకునిగానూ ఫిజిక్స్ ఐఐటి, నీట్ ఫ్యాకల్టీ, అకాడమీ ప్రిన్సిపల్‌గా పనిచేసిన అనుభవం ఉంది. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఐఐటి, నీట్ సాధించాలనే కలలు ఆర్థిక స్థోమత లేక అందని ద్రాక్షలా చాలా మంది విద్యార్థులు నిరాశ, నిస్పృహలకు గురవ్వడం చూశాను. వెనుకబడిన మన్యం ప్రాంతంలో కార్పొరేట్‌కు ధీటుగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో పాటు ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉచిత ఇంటర్ విద్యతో పాటు ఐఐటి, నీట్ అకాడమీ బోధనలు అందించాలనే దఢమైన సంకల్పముతో ఆర్కే జూనియర్ కళాశాలను స్థాపించాం.కార్పొరేట్ విద్యాసంస్థల్లో తాను పనిచేసినప్పుడు కెమిస్ట్రీ అధ్యాపకునిగా ప్రస్తుతం తమ కళాశాల ప్రిన్సిపల్ భూపాల్, ఫిజిక్స్ సీతంనాయుడు, గణితం వెంకటరమణ, రవి, ఇంగ్లీష్ ప్రశాంత్ కుమార్‌తో పాటు మరి కొంతమంది అధ్యాపకుల బృందంతో కలిసి కార్పొరేట్ కళాశాలల తరహాలో విద్యాబోధన అందిస్తున్నాం. ఆర్కే ఐఐటి, నీట్ అకాడమీని స్థాపించడం మాకు చాలా సంతోషాన్ని ఇస్తుందన్నారు.

బైపిసిలో మూడేళ్లుగా ఆర్కే విజయ కేతనం



ఇంటర్ బైపిసి ఫలితాల్లో మూడేళ్లుగా ఆర్‌కె విజయకేతనం ఎగురవేస్తోంది. స్థాపించిన మొదటి ఏడాదిలోనే బి.నీలిమ జిపిఎ 9.87 సాధించి పార్వతీపురానికి ప్రథమ స్థానం దక్కించుకోవడమే కాకుండా జేమ్స్ మెడికల్ కాలేజీలో సీట్ సంపాదించి వైద్య విద్యను అభ్యసిస్తోంది. రెండో ఏడాది కె.శ్రీజ సీనియర్ ఇంటర్లో 971 సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మూడో ఏడాది ఎం.హితశ్రీ జూనియర్ ఇంటర్ లో 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానం సాధించగా, అదే ఏడాది ఎంపిసిలో ఆర్.పల్లవి 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి రాష్ట్రంలో నాలుగో స్థానం దక్కించుకుంది.



ఆర్‌కె విద్యా సంస్థలు (ఇన్‌సెట్‌లో కరస్పాండెంట్ రామకృష్ణ



ప్రతిభ కనబర్చిన ఆర్‌కె విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జెఇఇ మెయిన్స్ 2023 రికార్డు ఆర్కేదే

మా ఆర్కే లో నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో 2023 జెఇఇ మెయిన్స్‌లో కార్పొరేట్ కళాశాలకు ధీటుగా ఈ ఏడాది జెఇఇ మెయిన్స్‌లో బి.నికిత 17,501, కె.అభిషేక్ 23,630, వై.సంజయ్ 26331, కె.సాయి సంతోష్ 28832, జి.సాయి భార్గవి 33993 ర్యాంకులు సాధించారు. వీరేకాకుండా 20 మంది విద్యార్థుల్లో 11 మంది విద్యార్థులు అర్హతను కూడా సాధించారన్నారు.

యూనివర్సిటీలోనూ ఆర్కే ఆణిముత్యాలు

ఉన్నత చదువులు చదవాలంటే కార్పొరేటీ కళాశాలల్లో లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టగలిగితే గాని ఉన్నత చదువులకు నోచుకోలేని మన్యం జిల్లా విద్యార్థులు తమ కళాశాలలో రెండేళ్లు ఇపిఎసెట్ కోచింగ్ తీసుకుని యూనివర్సిటీల్లో సీట్లు సంపాదించారు. వీరిలో బి.అఖిల్ (సివిల్), ఎం.మహేష్ (ఇసిఇ), ఎం.అనూష (ఇసిఇ), వి.హర్షిత (సిఎస్ఇ), జి.వర్షిని (సిఎస్ఇ), వి.శంకర్ (ఇసిఇ), బి.రాజేశ్వరి (ఐటి), ఆర్.సాయి కుమారి (సిఎస్ఎం), పి.కీర్తి (ఇసిఇ), కె.చరిష్మా (ఐటి), కె.లావణ్య (సిఎస్ఎం), కె.శ్రీజ, ఎస్.మేఘన, జి.ప్రత్యూష, జి.నీలిమ అగ్రికల్చర్ బిఎస్‌సిలో వివిధ బ్రాంచీల్లో ఎంవిజిఆర్, రఘు, అతమ్ వంటి కార్పొరేట్ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులు చదువుతున్నందుకు చాలా సంతోషిస్తున్నాం.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలనాయుడు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -బలిజిపేట

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు అన్నారు. మండలంలోని పెదపెంకిలో ఆయన నివాసం వద్ద మండల టిడిపి కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయి సమావేశం ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు వాడాడ రాము అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ 2024లో జరగబోయే ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులంతా కృషి చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని, ప్రజల్లోకి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి ఆ గ్రామంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును కల్పించుకొనే పార్టీ అండ ఉంటుందన్నారు. సీనియర్ నాయకులు వాడాడ రాము మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో గట్టిగా కష్టపడాల్సిన పరిస్థితి ఉందని, పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండలం నుంచి పార్టీ ఊహించిన ఫలితాలు ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి బాబ్జీ నాయకులు సింహాచలం, నల్ల సోమి నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో బుద్ధి చెబుదాం...

ప్రజాశక్తి - సీతంపేట

రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని టిడిపి నాయకులు పడాల భూదేవి ఉద్ఘాటించారు. మండలంలోని శిలగాం పంచాయతీ బెర్తుపురంలో ఆదివారం ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ముందుగా బాదుడే బాదుడుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీరు, విద్యుత్, హౌసింగ్ బిల్లుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించలేని వైసిపి ప్రభుత్వం పేదలపై బాదుడు కార్యక్రమానికి తలపెట్టిందని విమర్శించారు. ధరల పెరుగుదల, ఛార్జీల పెంపు వంటి వాటితో పేదల నడ్డి విరుస్తున్న వైసిపికి ఓటుతో బుద్ధి చెప్పాలని హితవు పలికారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ విధానాలు, సమస్యలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో భామిని మండలం టిడిపి నాయకులు కొత్తకోట గోవిందరావు దంపతులు ,శిలగాం శిమ్మయ్య, వార్డు సభ్యులు బాపయ్య, మొఖలింగం, సుబ్బారావు, రమేష్, రాజేష్, సింహాచలం, భారతి, చిన్నమ్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

సీతానగరం : మండలంలోని కామందొరవలసలో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవిలు మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం అధోగతి పాలు చేసిందన్నారు. ఈ ప్రభుత్వాన్ని వెంటనే గద్దెదించాలన్నారు. రాష్ట్రంలో రాక్షసి పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.తిరుపతిరావు, ఆర్.వేణు గోపాలనాయుడు, మండల పార్టీ నాయకులు సూర్యనారాయణ, బి.శ్రీనివాస రావు, డి.వెంకటనాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిష్టానం దృష్టికి ప్రజాభిప్రాయ సేకరణ నివేదిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సేకరించిన అంశాలను పార్టీ అధిష్టానం దృష్టికి పంపించినట్లు కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. డిసెంబర్ నుంచి మే వరకు నియోజకవర్గంలోని 137 పంచాయతీల్లో ఇదేం కర్మ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 9 అంశాలను ప్రజాభిప్రాయ సేకరణ చేసినట్లు చెప్పారు. వైసిపి పాలనలో నిత్యవసర ధరల పెరుగుదల, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో నిర్లక్ష్యం, పెట్రోల్ డీజిల్ గ్యాస్ సిలిండర్ ధరల పెంపు, ఫ్రీ ఇసుక లేకపోవడం తదితర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజా అభిప్రాయ సేకరణ ఎక్కువ అంశాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, నాయకులు కె.దాసు ఉన్నారు.

తప్పుడు కేసులు పెడితే భయపడేది లేదు : ఎంపిపి

గుమ్మలక్ష్మీపురం : నాయకులు రాజకీయం చేయడం అంటే నిబద్ధతతో కూడిన విలువలు గల వారై ఉండాలని ఎంపిపి కె.దీనమయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రెండో వైస్ ఎంపిపి నిమ్మక లక్ష్మణరావుపై తప్పుడు ఫిర్యాదు చేసిన నిమ్మక సింహాచలం రాజకీయ విలువలు లేనటువంటి నాయకుడని విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడ్నినని సింహాచలం చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇటీవల దుడ్డుఖల్లు సచివాలయ పరిధిలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఒక గ్రామ వాలంటీరును బాధ్యతల నుంచి తప్పించడం తప్పా అని ప్రశ్నించారు. కానీ సింహాచలం ఆమె పై సవతి తల్లి ప్రేమను చూపించి రెండో ఎంపిపి అయిన లక్ష్మణరావుపై పోలీస్ స్టేషన్లో తప్పుడు ఫిర్యాదు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తులు తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టిస్తే తాము భయపడేది లేదన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఫిర్యాదులు చేసి, తప్పుడు కేసులు పెట్టించడం మానుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మండల రెండో వైఎస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ గోరుశెట్టి గిరిబాబు, జడ్పిటిసి మండంగి రాధిక, అరకు పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రతినిధి నిమ్మక గోపాల్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బి.గౌరీ శంకర్రావు, వైసిపి నాయకులు నిమ్మక కష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

తాటి ముంజు.. భలే పసందు

ప్రజాశక్తి - కురుపాం

వేసవిలో తాటి ముంజెలకు భలే డిమాండ్. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పవచ్చు. వేసవిలో ముఖంపై వచ్చే మొటిమలకు విరుగుడు ఈ తాటి ముంజులు శరీరానికి కావాల్సిన చక్కెర, మినరల్స్ పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహదపడతాయి. ఇవి తినడం వల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. శరీరానికి కావాల్సిన ఎ, బి, సి విటమిన్లు ఐరస్, పొటాషియం, జింక్, ఫాస్పరస్ వంటివి పుష్కలంగా ఉండడంతో ఆరోగ్య పరంగా ఎంతో ఉపయోగపడతాయి. శరీర బరువు తగ్గుదలకు ఉపకరిస్తాయి.



విక్రయించేందుకు తాటి ముంజులు తీస్తున్న గీత కార్మికులు

కష్టంతో కూడిన పని :

తాటికాయల నుంచి ముంజులను తీయడంలో నైపుణ్యంతో పాటు శారీరక శ్రమ ఇమిడి ఉంటుంది. గీత కార్మికులు అనేక కష్టాలు పడుతూ వీటిని తీసి అమ్ముతుంటారు. అయితే వీరికి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. తాటి కాయలు తీసే క్రమంలోనూ, చెట్టు ఎక్కి దిగిన సందర్భంలోనూ మెలుకువులు పాటించాల్సి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే గీత కార్మికులు ఎంతో సాహసంచేయాల్సి ఉంటుంది.

తాటి కాయల్లో రకాలు

తాటి కాయల్లో ఎన్నో రకాలు ఉన్నాయి. ఉప్పర తాటి, కుంచాల తాటి, గజ తాటి, నల్ల కాయలు తాటి ముంజెలు ఎంతో శ్రేష్టమైనవి.

ఆరోగ్యానికి మేలు

తాటి ముంజెలు తింటే శరీరానికి కావాల్సిన చక్కెర, మినరల్స్ పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహదపడతాయి. ఎండా కాలంలో వేడికి సాధారణంగా మలబద్ధకం ఏర్పడుతుంది. ఈ సమయంలో తాటి ముంజెలు తింటే మల బద్ధకం తగ్గుతుంది.

డాక్టర్ బి.ప్రజ్ఞ,
మొండెంఖల్ పిహెచ్‌సి.



నీటిలో సైక్లింగ్ చేస్తున్న చిన్నారులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట :

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం, అందులో వేసవి సెలవు కావడంతో పర్యాటకులు తమ కుటుంబాలతో పిల్లలతో సెలవులు చివరి కావడంతో తండొప తండోలుగా తరలివచ్చారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. ఆనంద్ విహార్ వద్ద డాన్సులు వేసి ఉత్సాహంగా, ఉల్లాసంగా కేరింతలు కొట్టారు. స్కై సైకులెక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ, యువకులు నడిచి వెళ్లారు. జెయిట్‌వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాలు ఊగారు. చిన్నారులు స్విమ్మింగ్ పూల్‌లో జలకాలాడిన అనంతరం మెట్టిగూడ జలపాతాన్ని సందర్శించారు.

కత్తితో వ్యక్తిపై దాడి..

ఆర్థిక లావాదేవీలే కారణం



గాయపడిన రమణ

రేగిడి: మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ అనుబంధం ఇథనాలు కర్మాగారంలో సంకిలి గ్రామానికి చెందిన కర్రి రమణపై పాలకొండకు చెందిన తిరుమల కనస్ట్రక్షన్ సూపర్‌వైజర్ జమ్ము లక్ష్మీనారాయణ ఆదివారం కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రమణ మెడకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ పనిచేస్తున్న కార్మికులు అతన్ని హుటాహుటిన రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ కర్మాగారంలో తిరుమల కనస్ట్రక్షన్ తరుపున లక్ష్మీనారాయణ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. సంకిలికి చెందిన రమణ ఇదే కనస్ట్రక్షన్‌కు ఇంటి నిర్మాణ మెటీరియల్‌ను అందించేవాడు. ఈ నేపథ్యంలో సూపర్ వైజర్‌గా ఉన్న లక్ష్మీనారాయణకు, రమణకు మధ్య ఆర్థిక లావాదేవీలు నడిచాయి. అయితే గత కొంత కాలంగా డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం కర్మాగారంలో మరోసారి గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో లక్ష్మీనారాయణ కత్తితో రమణ మెడపై దాడి చేసి పరారయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు తన సిబ్బందితో ఆసుపత్రికి వెళ్లి బాధితుడు రమణ వద్ద వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి - బొబ్బిలి

సిపిఎం, మీడియా చొరవతో బెల్ట్ షాపులకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బొబ్బిలి పట్టణానికి చెందిన రెడ్డి శ్రీను హెర్బర్ట్ డాక్టర్ సందులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యాన్ని ఎం.బూర్జవలస బెల్ట్ షాపులకు అక్రమంగా తరలిస్తున్నారు. మద్యం అక్రమంగా తరలిస్తున్నట్లు మీడియాకు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలంకు తెలియడంతో నిఘా పెట్టి పాత చక్కెర పరిశ్రమ వద్ద అక్రమ మద్యాన్ని పట్టుకుని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు కానిస్టేబుల్స్ అక్కడకు చేరుకుని అక్రమంగా తరలిస్తున్న 107 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తరలింపు, బెల్ట్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం డిమాండ్ చేశారు.

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - బాడంగి

మండలంలోని డొంకినవలస గ్రామ సమీపంలో ఆదివారం అక్రమంగా మద్యం తరలిస్తున్న జామి కృష్ణ, జామి బంగారి నాయుడు, లక్ష్మిపురం గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులను బాడంగి ఎస్ఐ జయంతి తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్ నిమిత్తం వారిద్దరినీ రిమాండ్ నిమిత్తం బొబ్బిలి ఎజెఎఫ్‌సిఎం కోర్టుకు తరలించారు.